ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 28, డిసెంబర్ 2025

## జీఓ నెం.252ను

# తక్షణమే సవరించాలి



✶ కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టుల నిరసన

✶ మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం ఇచ్చిన జర్నలిస్టులు



**ఆసిఫాబాద్, డిసెంబర్ 27, ప్రభాతవార్త**

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచే జర్నలిస్టుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వ జీఓ నెం.252ను తక్షణమే సవరించాలని జర్నలిస్టు యూనియన్ జిల్లా కన్వీనర్ (టియూడబ్ల్యూజే హెచ్ 143) రవి నాయక్ డిమాండ్ చేశారు. శనివారం జీఓ నెం.252ను తక్షణమే సవరించాలని నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు కొమరం భీమ్ ఆసిఫాబాద్ కలెక్టరేట్ ముట్టడి నిర్వహించినట్లు తెలిపారు. జర్నలిస్టులకు హక్కుగా అందించాల్సిన అక్రిడేషన్ కార్డుల్లో కోత విధించడం తగదని, గతంలో అమలులో ఉన్న విధానాన్ని కొనసాగిస్తూ నియోజకవర్గస్థాయి, మండల స్థాయి అక్రిడేషన్ కార్డులను వెంటనే పునరుద్ధరించాలని ఆయన స్పష్టం చేశారు. జీవో 252 జర్నలిస్టుల జీవితానికి గొడ్డలి పెట్టులాంటిదన్నారు. దీని ద్వారా వర్కింగ్ జర్నలిస్టుల కార్డులో కోత విధించడంతో పాటు, డెస్క్ జర్నలిస్టులకు అన్యాయం చేసేలా ఉందన్నారు. ఈ నేపథ్యంలో మీడియా కార్డుల పేరుతో డెస్క్ జర్నలిస్టుల హక్కులను కాలరాసేలా ఉన్న జీవో 252 ను సవరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పాత జీవో 239 కొనసాగించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు అందించాల్సిన ఆర్టీసీ బస్‌పాస్‌కు సంబంధించిన మిగతా 2లో..



# పెండింగ్ డబ్బులు చెల్లించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా

✣ ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

✣ జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం ఇచ్చిన సీఐటీయు నాయకులు

**మంచిర్యాల, డిసెంబర్ 27, ప్రభాతవార్త**

ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో ఆశా యూనియన్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శనివారం పెండింగ్‌లో ఉన్న లెప్రసీ, ఎండిప డబ్బులు చెల్లించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టర్ ఆఫీస్ ఎదుట ధర్నా చేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్ సీఐటీయు జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ, తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల ముందు ఆశా వర్కర్లు సమ్మె, మిగతా 2లో..




## కన్నుల పండువగా

# సుదర్శన యాగం మహోత్సవం

**తాండూర్, డిసెంబర్ 27, ప్రభాతవార్త**

రెబ్బెన మండలంలోని గంగాపూర్ శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం సుదర్శన యాగం మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ అర్చకులు, వేద పండితులు ముద్దు దినేష్ శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు ధీరజ్ శర్మ, సునీల్ శర్మ, సుమంత్ శర్మ, పలువురు వేద పండితులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా బండి మనోజ్ చైతన్య, సంతోష్‌లావణ్య దంపతులు చేత సుదర్శన యాగాన్నిజరిపించారు. అంతకుముందు వేద పండితులు ప్రాతస్సూత్తమంత్ర పఠనం గురువందనం, గణపతి పూజ యాగ సంకల్పం, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశనం, నవగ్రహపూజ, వాస్తు పూజ, యోగిని పూజ, క్షేత్రపాలపూజ, సుదర్శన కలశస్థాపన పూజ, అభిషేకం, మిగతా 2లో..



## స్కానింగ్ సంబంధిత పూర్తి వివరాలు

# నిర్ణీత నమూనాలో తప్పనిసరిగా నమోదు చేయాలి

☆ మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత

**నస్పూర్, డిసెంబర్ 27, ప్రభాతవార్త**

జిల్లాలోని స్కానింగ్ కేంద్రాలలో సాంకేతిక వైద్య నిపుణులు, సిబ్బంది, స్కానింగ్ చేసిన వివరాలను నిర్ణీత నమూనాలో తప్పనిసరిగా నమోదు చేయాలని మంచిర్యాల జిల్లా అడ్వైజరీ కమిటీ చైర్ పర్సన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో లింగ నిర్ధారణ పరీక్షలు, పిసిపి ఏంటి యాక్టివ్ పై ఏర్పాటు చేసిన జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అరుణశ్రీ, జిల్లా పౌర సంబంధాల అధికారి యం.కృష్ణమూర్తి లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మిగతా 2లో..



## పెండింగ్ డబ్బులు చెల్లించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా

(మొదటిపేజీ తరువాయి)



పోరాటాలు చేసిన ఫలితంగా ప్రతి ఆశాకు నెలకు 18వేలు ఫిక్స్డ్ వేతనం ఇస్తామని,ఇన్సూరెన్స్ 50 లక్షలు, మట్టి ఖర్చులకు 50 వేలు, ఏఎన్సి, పిఎన్సి టార్గెట్స్ రద్దు చేస్తామని హామీలు ఇచ్చిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఒక సంవత్సరం గడిచిన హామీలు అమలు చేయలేదు. అదే విధంగా లెప్రసీ, ఎండిఏ సర్వేలు చేసిన ప్రభుత్వం మాత్రం డబ్బులు చెల్లించడం లేదని,సమ్మక్క ఆశా యూనియన్ (సీఐటీయు) జిల్లా అధ్యక్షురాలు మాట్లాడుతూ,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారితోషకం పేరుతో ఆశాలతో వెట్టి చాకిరీ చేయించుకుంటుంది. కనీస వేతనం ఇవ్వకుండా శ్రమ దోపిడీకి గురిచేస్తుందని,ఆశాల పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు సరైంది కాదని,పోరాటం చేస్తున్న ఆశాలతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరపాలి.సమస్యలు పరిష్కరించాలి లేకుంటే రాబోయే రోజుల్లో ఆందోళన పోరాటాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో శోభ ఆశా యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్, విజయలక్ష్మి నాగుబాయ్ పద్మ ఆశా యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు, ఎస్. వెంకటస్వామి సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి, సీఐటీయు జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా సుదర్శన యాగం మహోత్సవం

(మొదటిపేజీ తరువాయి)

ఆర్చన పోతది, గణపతిహోమం, నవగ్రహ, వాస్తు, క్షేత్రపాల యోగిని మండల దేవతానామములు,సుదర్శన హవనం, జయాదులు,బలిప్రదానం, పూర్ణాహుతి, కుంబాభిషేకం, హారతి, ఆశీర్వచనం పూజాక్రతువును వైభవంగా నిర్వహించారు. సుదర్శన యాగం అనంతరంతీర్ధ ప్రసాద, అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గిరిజన కుటుంబాలకు సొంతింటి భరోసా...

**- ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు**

పెంచికల్ పేట్, ప్రభాతవార్త:



ప్రతి గ్రామ పంచాయతీకి కొత్తగా 20 ఇందిరమ్మ ఇండ్లు త్వరలో మంజూరు చేయనున్నట్లు సిర్పూర్ శాసన సభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు వెల్లడించారు. పెంచికల్ పేట్ మండలంలోని ఎల్కపల్లి రైతు వేదికలో శనివారం నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో 26 మంది గిరిజన లబ్ధిదారులకు ఇండ్ల మంజూరు పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో రాజకీయాలను పక్కనపెట్టి గ్రామ అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో సర్పంచులు రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని హితావు పలికారు. పేదలు, అర్హులైన వారికి మాత్రమే ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడి మహేందర్, ఏఈ సందీప్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు భక్తు రాంచందర్, అన్నం రుక్మబాయి, చప్పిడి రవిందర్, పొట్టే ఉమాదేవి, అల్లూరి రాజేశ్వరి, పోరేటి వెంకటేష్, ఉప సర్పంచులు నారాయణ, శ్రీనివాస్, అనిల్, వినోద్, బిజెపి మండల అధ్యక్షులు కుకిడే రాజేష్,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పులి సంచారంపై సింగరేణి అప్రమత్తం

**- ఓబీ డంప్ యార్డును సందర్శించిన అధికారులు**

**- శ్రీరాంపూర్ ఏరియాలో పటిష్టమైన రక్షణ చర్యలు**

నస్పూర్, డిసెంబర్ 27, ప్రభాతవార్త



శ్రీరాంపూర్ ఉపరితల గని పరిసరాల్లో ఇటీవల పులి సంచరించిన నేపథ్యంలో సింగరేణి ఫారెస్ట్ అడ్వైజర్ పరిగెన్, ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్, అటవీ డివిజన్ అధికారి సర్వేశ్వర్ శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఓబీ డంప్ యార్డ్ ప్రాంతాన్ని పరిశీలించి, భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ కార్మికుల రక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ప్రధాన రహదారులపై బారికేడ్ల ఏర్పాటు, గని పరిసరాల్లో పిచ్చి మొక్కల తొలగింపు పూర్తి చేశామని తెలిపారు. అటవీ శాఖ పెట్రోలింగ్ కోసం సింగరేణి తరపున 24 గంటల పాటు ఒక వాహనాన్ని అందుబాటులో ఉంచామన్నారు. సెక్యూరిటీ సిబ్బంది, అటవీ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎప్పటికప్పుడు కార్మికులను, వారి కుటుంబ సభ్యులను అప్రమత్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ అధికారి చిప్ప వెంకటేశ్వర్లు, డీజీఎం (ఫారెస్ట్) ఏబీ హరి నారాయణ, సర్వే అధికారి సంపత్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రత్నాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జీఓ నెం.252ను తక్షణమే సవరించాలి

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టమైన గైడ్‌లైన్స్‌ను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు సంతోష్ కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు హనుమయ్య, గిరీష్. సతీష్. ఇర్ఫాన్, రాజు, కిరణ్, రామస్వామి, అంజయ్య, సతీష్ తోపాటు మరికొంతమంది సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

మంచిర్యాల, డిసెంబర్ 27, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన జర్నలిస్టు అక్రిడిటేషన్ జీవో నం. 252ను వ్యతిరేకిస్తూ మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టు సంఘాల నాయకులు మాట్లాడుతూ,నూతన జీవోలోని నిబంధనల వల్ల అర్హులైన అనేక మంది జర్నలిస్టులు అక్రిడిటేషన్కు దూరమవుతున్నారని, ఇది జర్నలిస్టుల హక్కులను హరించే చర్యఅని, వెంటనే జీవో నెంబర్ 252 రద్దు చేయాలని వినతి పత్రం అందజేశారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టు సంఘం నాయకులు

### 5వ రోజుకు చేరిన జర్నలిస్టుల రిలే నిరాహార దీక్ష..

నిర్మల్ రూరల్, డిసెంబర్ 27, ప్రభాతవార్త:

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ఇళ్ల స్థలాల కోసం చేపట్టిన జర్నలిస్టుల రిలే నిరాహార దీక్ష నేటికి ఐదవ రోజు కొనసాగింది. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన నూతనసర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం మరియు సన్మాన కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావుకు నిర్మల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలు ఇప్పించి మాకు న్యాయం చేయాలంటూ నిర్మల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రాసం శ్రీధర్ వినతి పత్రాన్ని అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రివర్యులు తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తానని అన్నారు.

### స్కానింగ్ సంబంధిత పూర్తి వివరాలు

# నిర్ణీత నమూనాలో తప్పనిసరిగా నమోదు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలో పిసిపిఎన్డిటి యాక్ట్ ప్రకారం 53 స్కాన్ కేంద్రాలు పని చేస్తున్నాయని, ఇందులో 4 ప్రభుత్వ పరంగా, 49 ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలు స్త్రీ వైద్య నిపుణులు, రేడియాలిస్టులు, సూపర్ స్పెషలిస్టులు ద్వారా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి స్కానింగ్ కేంద్రంలో స్కానింగ్ పరికరము నిర్వహిస్తున్న వైద్యుల వివరములు నమోదు అయి ఉండాలని, అదే విధంగా ప్రతి కేంద్రంలో లింగ నిర్ధారణ పైన తీసుకుంటున్న చర్యల వివరాలపై ఫ్లెక్సీ, పోస్టర్ల ద్వారా అవగాహన కలిగించాలని తెలిపారు. లింగ నిర్ధారణ చేయబడదు, చెప్పబడదు, అడిగిన వారికి, చెప్పిన వారికి యాక్ట్ ప్రకారంగా చర్యలు చేపట్టబడును అని వివరాలను ప్రదర్శించాలని, స్కానింగ్ కేంద్రంలో గర్భవతులకు కుర్చీలు, త్రాగునీటి సౌకర్యము కల్పించాలని, వైద్యుల వివరాలు, రుసుముల వివరాలు గోడ పై అతికించాలని తెలిపారు. గర్భవతుల స్కానింగ్ పూర్తి వివరాలను ఫార్మ్ ఆఫ్ లో నమోదు చేయాలని, స్కానింగ్ చేసుకుంటున్న గర్భవతి సంతకం తీసుకోవాలని, ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలు గర్భవతులకు, తల్లులకు, ఇంటి వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. కమిటీ సభ్యులు అడిగిన ప్రకారంగా మండలాల వారిగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, గోడ ప్రతులు, కరపత్రాలు, స్థానిక ఛానళ్ల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. బర్త్ రూట్ ఆసుపత్రికి సంబంధించిన స్కానింగ్ మెషిన్‌ను అప్లోడ్ చేయడం జరిగిందని తెలిపారు. పిసిపి ఎంటి పోర్టల్‌లో వచ్చిన వివరాలను తెలియజేసి తగు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో గర్భవతులకు చేసే స్కానింగ్ మాత్రమే కాకుండా సూపర్ స్పెషాలిటీ వైద్యులు చేస్తున్న వారి స్కానింగ్ వివరములు కూడా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి తెలియజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హీల్ వాలంటరీ ఆర్గనైజేషన్ ఎన్.జి.ఓ. డాక్టర్ మంచు రాజ్ కిరణ్, గైనకాలజిస్ట్ డాక్టర్ నలుమాసు శ్రీదేవి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, గైనకాలజిస్టు పెడియాట్రిషన్లు, ఫిజీషియన్లు, డిపిఒ ప్రశాంతి, సిహెచ్ఓలు వెంకటేశ్వర్లు, దిశ సమన్వయకర్త రమేష్, సుమన్, సీనియర్ అసిస్టెంట్ హారిక, డిపిహెచ్ఎన్ పద్మ, వసుమతి మార్తా, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రక్షణతో నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలి

**- డైరెక్టర్ పి.పి వెంకటేశ్వర్లు**

జైపూర్, డిసెంబర్ 27, ప్రభాతవార్త



సింగరేణి ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్‌తో కలిసి శనివారం ఇందారం ఉపరితల గనిని సందర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ రక్షణతో నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను ప్రణాళిక బద్ధంగా సాధించాలన్నారు. లక్ష్యాల సాధనకు ప్రణాళికలు వేసుకుని ముందుకు వెళ్లాలని,ఉపరితల గనులకు కావలసిన యంత్రాలను, యంత్ర సామాగ్రిని సమకూర్చుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా వరాహ ఓబి కాంట్రాక్టు ప్రతినిధులను ఏ నెలకు ఆ నెల ఓబి 20.185 లక్షల క్యూబిక్ మీటర్ల ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలన్నారు. రక్షణ నియమాలను పాటిస్తూ సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను సాధిస్తూ ముందుకు సాగాలన్నారు.ఈ ఆర్థిక సంవత్సర మూడు నెలల కాలంలో నిర్దేశిత లక్ష్యాలు సాధించడానికి కావలసిన అన్ని ఏర్పాట్లు చేసుకొని ముందుకు వెళ్లాలని తప్పనిసరిగా లక్ష్య సాధనకు ప్రతి ఒక్క ఉద్యోగి అధికారి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇందారం ఉపరితల ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేశ్వర్ రెడ్డి, గని మేనేజర్లు నాగన్న, శంకర్, రక్షణ అధికారి లక్కాకుల మహేష్, వరాహ కాంట్రాక్ట్ కంపెనీ ప్రతినిధుల పాల్గొన్నారు.

## పీడీఎస్యూ రాష్ట్ర 23వ మహాసభలను విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్, డిసెంబర్ 27, ప్రభాతవార్త:

పీడీఎస్యూ రాష్ట్ర 23వ మహాసభలను విజయవంతం చేయాలని పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి పిలుపునిచ్చారు. శనివారం కొమురంభీం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మహాసభల గోడప్రతులను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీడీఎస్యు జార్జిరెడ్డి, జెసిఎస్ ప్రసాద్ స్ఫూర్తితో గత యాభై ఏండ్ల కాలంగా విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ అనేక హక్కులను సాధించి పెట్టిందన్నారు. విద్యలో అంతరాలు లేని శాస్త్రీయ విద్యాసాధనే లక్ష్యంగా పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఈ క్రమంలో ఎంతో మంది విద్యార్థి రత్నాలు తమ విలువైన ప్రాణాలను కోల్పోయారని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో సంస్కరణల పేరిట విద్యార్థి వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. విద్యను పూర్తిగా వ్యాపార సరుకుగా మారుస్తున్నారని మండిపడ్డారు. విద్యారంగంలో వస్తున్న మార్పులను అర్థం చేసుకుంటూనే భవిష్యత్తు విద్యార్థి ఉద్యమాలను రూపొందించుకోవడం కోసం జనవరి 5, 6, 7 తేదీల్లో వరంగల్లో రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు విద్యార్థులు అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా ఉపాధ్యక్షులు షేక్ అయ్యూబ్ ఖాన్, మండల ఉపాధ్యక్షులు మల్లేష్, నాయకులు జంగు, రాజు, రవి, రత్నాకర్, నాగమణి, కీర్తి, సరస్వతి, అక్షయ, కీర్తన, సంగీత, అనిత పాల్గొన్నారు.





కాంగ్రెస్ పార్టీలో చేరిన యువకులతో మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ

## కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

**మంచిర్యాల, డిసెంబర్ 27, ప్రభాతవార్త**

మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మంచిర్యాల నియోజకవర్గాన్ని చేస్తూన్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై,మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని తిలక్ నగర్ నుండి తాజా మాజీ కౌన్సిలర్ మజీద్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు రేగుంట వెంకటేష్ దాదాపు 150 మంది యువకులతో శనివారం ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు తూముల నరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పుదారి తిరుపతి, నాయకులు, మహిళా నాయకురాలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## డిజిటల్ బోధనతో పాఠాలు సులభతరం

**లక్షెట్టిపేట, డిసెంబర్ 27, ప్రభాతవార్త**

డిజిటల్ తరగతులతో విద్యార్థులకు క్లిష్టమైన పాఠాలు సైతం త్వరగా అర్థమవుతాయని వెంకట్రావుపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు పర్వీన్ సుల్తానా అన్నారు. శనివారం దౌడేపల్లి ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్ రూంను ప్రారంభించారు. ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను ఉపయోగించి నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. కార్యక్రమంలో గిరిధర్, ఉపాధ్యా యులు సతీశ్, సీఆర్పీ విద్య పాల్గొన్నారు.

## ఆటోలో నుంచి పడి మహిళ మృతి

**లక్షెట్టిపేట, డిసెంబర్ 27, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మండలం దౌడపల్లి గ్రామానికి చెందిన మేడి రాజేశ్వరి (53) ప్రమాదవశాత్తు ఆటోలో నుండి కిందపడి తలకు రక్తం గాయమై మృతి చెందింది అని ఎస్ఐ గోపతి సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు దౌడేపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మద్యాన భోజన వంట మనిషిగా పనిచేస్తుంది. రోజు మాదిరిగా మృతురాలు రాజేశ్వరి తన పని ముగించుకొని తమతో పాటు పనిచేసే వాళ్ళతో కలిసి అదే గ్రామానికి చెందిన అమీర్ పాష అనే అతని ఆటోలో ఇంటికి వస్తుండగా తన ఇంటి సమీపంలో ప్రమాదవశాత్తు ఆటోలోంచి కిందపడి పోగా స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి భర్త ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతురాలి భర్త మేడి నరసయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడం జరుగుతుందనీ తెలిపారు.



### మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను

# ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

**- బీఆర్ఎస్ సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురె శ్యామ్‌రావు**



మాట్లాడుతున్న లెండుగురె శ్యామ్‌రావు



కార్మికుల సమ్మెలకు మద్దతు తెలుపుతున్న నాయకులు

**కాగజ్‌నగర్, డిసెంబర్ 27, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ మున్సిపల్ కార్మికులు గత ఐదు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ లను సక్రమంగా జమ చేయకపోవడాన్ని నిరసిస్తూ కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట గత ఐదు రోజులుగా నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సమ్మెకు మద్దతుగా బీఆర్ఎస్ సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ లెండుగురె శ్యామ్ రావు సమ్మె శిబిరాన్ని సందర్శించి కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలినట్లు పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికులు పట్టణ పరిశుభ్రతకు కీలక పాత్ర పోషిస్తున్నారని, అలాంటి కార్మికులకు నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడం దారుణమని అన్నారు. వెంటనే పెండింగ్ జీతాలు విడుదల చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ లను పూర్తిస్థాయిలో జమ చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోవడం ముమ్మాటికి ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్మికుల హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతుందని, చివరి వరకు కార్మికులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నక్క మనోహర్,సిందం శ్రీనివాస్, మహిళా నాయకులు వరలక్ష్మి, కమల,తాజ్, మున్సిపల్ కార్మికులు, సంఘ నాయకులు, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## శివాజీ జయంతిని అధికారికంగా ప్రకటించాలి

**పెంచికల్ పేట్, డిసెంబర్ 27, ప్రభాతవార్త:**



వినతిపత్రం అందజేస్తున్న అరె కులస్తులు

ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని అధికారికంగా సెలవు దినంగా ప్రకటించాలని కోరుతూ అరె కులస్తులు శనివారం సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యనికి, స్వరాజ్య స్థాపనకు పోరాడిన మహోన్నత వీరుడు ఛత్రపతి శివాజీ అని కొనియాడారు. అయన జయంతిని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని, సెలవు కోరారు. ఈ కార్యక్రమంలో అరె కుల సంఘం నాయకులు, పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



అఖండ హరినామ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంత్ శ్రీరామ్ మహారాజ్

## అఖండ హరినామ పోస్టర్ ఆవిష్కరణ

**నార్నూర్, డిసెంబర్ 27, ప్రభాతవార్త :**

నార్నూర్ మండలంలోని చోర్గావ్ గ్రామంలో శనివారం అఖండ హరినామ మహా యజ్ఞ కార్యక్రమం పోస్టర్ను సంత్ శ్రీరామ్ మహారాజ్ విడుదల చేశారు. తలమడుగు మండలంలోని పల్సి(బి) తండాలో జనవరి 2 నుంచి 4వ తేదీ వరకు నారాయణ మహారాజ్ ఆధ్వర్యంలో రథమహోత్సవం, భజన, దేవతలకు అభిషేకం, మహాహారతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి

**- ఫర్టిలైజర్ యాప్‌పై డీలర్లు అవగాహన కల్గి ఉండాలి**

**- మండల వ్యవసాయాధికారి రామకృష్ణ**

**కాగజ్‌నగర్ రూరల్, డిసెంబర్ 27, ప్రభాతవార్త :**

రబీ సీజన్‌లో రైతులకి కావల్సిన వితనతనాలు ఎరువులు అందుబాటులో ఉంచాలని, అదే విధంగా త్వరలో అందుబాటులో రానున్న ఫర్టిలైజర్ యాప్‌పై డీలర్లు అవగాహన కల్గి ఉండాలని కాగజ్‌నగర్ మండల వ్యవసాధికారి జి. రామకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఎఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఎరువుల దుకాణాల్లోని రికార్డులు, బిల్లు బుక్స్‌లను తనిఖీ చేసి డీలర్లకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ రబీ సీజన్ లో రైతులకి అవసరమైన విత్తనాలు, ఎరువులు సరిపడ అందుబాటులో ఉంచాలని సూచించారు. నిల్వ ఉన్న ఎరువుల సమాచారాన్ని బోర్డు పైన రైతులకి కనిపించేలా ఉంచాలని అన్నారు. రైతులకు యూరియాను సులువుగా అందించేందుకు ప్రభుత్వం త్వరలో అందుబాటులో తీసువస్తున్న ఫర్టిలైజర్ యూరియా యాప్ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో కూడా అమలులో రానుందని, ఫర్టిలైజర్ దుకాణాల డీలర్లు అందరూ యూరియా యాప్ పైన పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. యాప్ పైన ఎలాంటి సందేహాలు ఉన్న వ్యవసాయ శాఖ వారినీ సంప్రదించాలని అన్నారు. ఆయన వెంట ఫర్టిలైజర్ షాపు డీలర్లు ఉన్నారు.



ఎరువుల దుకాణంలో రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న ఏఓ రామకృష్ణ

# రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి

**సింగరేణి డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు - బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై విస్తృత స్థాయి సమీక్ష**

నస్పూర్, డిసెంబర్ 27, ప్రభాతవార్త

సింగరేణి సంస్థ డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కె. వెంకటేశ్వర్లు శనివారం శ్రీరాంపూర్ ఏరియాలో పర్యటించారు. ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్‌తో కలిసి ఆయన శ్రీరాంపూర్ ఉపరితల గనిలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. అనంతరం డైరెక్టర్ గనిలోని వ్యూ పాయింట్ సందర్శించి, పని ప్రదేశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. గనిలో వినియోగంలో ఉన్న భారీ యంత్రాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గనిలో నిల్వ ఉన్న బొగ్గును వీలైనంత త్వరగా వినియోగదారులకు రవాణా చేయాలని అధికారులను ఆదేశించారు. రక్షణ నియమాలను పాటిస్తూనే, సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి ప్రతి అధికారి, ఉద్యోగి అంకితభావంతో, పక్కా ప్రణాళికలతో ముందుకు సాగాలని డైరెక్టర్ పిలుపునిచ్చారు. ఉపరితల గనులకు అవసరమైన యంత్రాలను, ఇతర సామాగ్రిని ఎప్పటికప్పుడు సమకూర్చుకోవాలని తెలిపారు. ఓబీ కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులు, గని అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఏ నెల లక్ష్యాలను ఆ నెలలోనే అధిగమించాలని స్పష్టం చేశారు. రక్షణ విషయంలో రాజీ పడకుండా ఉత్పత్తిని పెంచడమే ధ్యేయంగా పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ చిప్ప వెంకటేశ్వర్లు, ఇందారం ఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏ. వెంకటేశ్వర రెడ్డి, ఎస్వోర్పీ ఓసీపీ మేనేజర్ ఇందూరి శ్రీనివాస్, ప్రాజెక్ట్ ఇంజనీర్ నాగరాజు, గ్రూప్ ఇంజనీర్ సాంబశివ రావు, రక్షణాధికారి శ్రీధర్, సర్వే అధికారి సంపత్ , ఓబీ కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



వ్యూ పాయింట్ నుండి పని ప్రదేశాలను పరిశీలిస్తున్న డైరెక్టర్, జనరల్ మేనేజర్



సర్పంచులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే హరీష్ బాబు

## నూతన సర్పంచులకు ఎమ్మెల్యే హరీష్ బాబు సన్మానం

పెంచికల్ పేట్, డిసెంబర్ 27, ప్రభాతవార్త:

మండలంలో నూతనంగా ఎన్నికైన పలు గ్రామపంచాయతీల సర్పంచులను శనివారం సిర్పూర్ శాసనసభ్యులు హరీష్ బాబు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల సమన్వయంతో సర్పంచులు బాధ్యతయుతంగా పనిచేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు, తాగునీరు, పారిశుద్ధం, రహదారుల అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఉమా, రవీందర్, రాంచంధర్, రుక్మబాయి, రాజేశ్వరి, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు, నాయకులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న లింగాపూర్ సర్పంచ్ రాజశేఖర్

## లింగాపూర్ జాతరలో ప్రారంభమైన వాలీబాల్ పోటీలు

లింగాపూర్, డిసెంబర్ 27, ప్రభాతవార్త :

లింగాపూర్ మండలంలో జగదాంబ దేవి జాతర సందర్భంగా వాలీబాల్ పోటీలను సర్పంచ్ జదవ్ రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జదవ్ రాజశేఖర్ మాట్లాడుతూ జగదాంబ దేవి జాతర సందర్భంగా మండలంలోని వాలీబాల్ క్రీడా అభిమానులు జాతరలో వాలీబాల్ పోటీలకు పాల్గొని తమ ప్రతిభను చాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాదవ్ గణపత్ నాయక్. రవీందర్. భుజంకరావు తదితరులు పాల్గొన్నారు



ప్రత్యేక పూజలు చేస్తున్న బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి దంపతులు

## కడ్తాల్ అయ్యప్ప ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

సారంగాపూర్, డిసెంబర్ 27,ప్రభాతవార్త:

సోన్ మండలం కడ్తాల్ గ్రామ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో మండల పూజను పురస్కరించుకుని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి దంపతులు శనివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ గురుస్వామి నర్సారెడ్డి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు అందజేశారు. అయ్యప్ప స్వామికి 41 రోజుల మండల కాలం (వృశ్చిక మాసం నుండి ధనుర్మాసం వరకు) ముగింపు సందర్భంగా హరిహర పుత్రుడికి ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వాములు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం అయ్యప్ప నామస్మరణతో మారుమోగింది. స్వాములతో కలిసి ఎమ్మెల్యే బిక్షలో పాల్గొన్నారు.

## మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే

నెరడిగొండ,డిసెంబర్ 27, ప్రభాతవార్త :

నెరడిగొండ మండలంలో ని నర్సనాయక్ తాండ గ్రామానికి చెందిన వినేశ్ జాదవ్,జాదవ్ కలబాయి ఇటీవల స్వర్గస్తులైయ్యారు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరి వెంట గణేష్ జాదవ్, సర్పంచ్ లలిత రమేష్, నవాయిరాం, సరోజ, భరత్, మంగల్ సింగ్, పతేసింగ్, నజీర్, రాజు, భోజన్న,సాయి కృష్ణ తదితరులు ఉన్నారు



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## 8 మంది పేకాట రాయుళ్ల అరెస్టు

చింతలమానేపల్లి, డిసెంబర్ 27, ప్రభాతవార్త :

మండల పరిధిలోని గూడెం గ్రామ శివారులో రహస్యంగా పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, కాగజ్ నగర్ డీఎస్పీ సూచనలతో కౌటాల సీఐ పర్యవేక్షణలో ఈ దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ ఇస్లావత్ నరేష్ తెలిపారు.ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారులో కొందరు వ్యక్తులు జూదం ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారంతో పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న బోయిరే నారాయణ, పాలే మహేష్, ఘాట్ల లాచ్చయ్య, బంగారే సాధయ్య, నీకడే తిరుపతి, జంగిటీ అశోక్, నానాజీ, దేశముక్ పవన్‌లను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 2,330 నగదుతో పాటు పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని, చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.





## మహాగాం జిపి షేకు గూడ గ్రామంలో ఎన్ఎస్ఎస్ శీతాకాల సేవా శిబిరం ప్రారంభం


నార్నూర్, డిసెంబర్ 27, ప్రభాతవార్త :

ప్రభుత్వ జూనియర్ కళాశాల నార్నూర్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఈరోజు నుండి ఏడు రోజుల శీతాకాల సేవా శిబిరం ప్రారంభమైంది. అక్కడి గ్రామ పటేల్, సర్పంచ్ అన్ని విధాలుగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు సహాయ సహకారాలు అందిసామని అన్నారు. శనివారం ప్రారంభం రోజు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ర్యాలీగా గ్రామానికి వెళ్లి రైతు వేదిక పరిసరాలను పరిశుభ్రం చేశారు. రంగనం ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వెంకట కేశవులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బాలాజీ కాంబ్లే, వెంకటరమణ, అజయ్ కుమార్, హెచ్ జాలేందర్, మాన్సు పటేల్, కొత్తగా ఎన్నికైన సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ, బాయ్స్ హాస్టల్‌ను సందర్శించిన సర్పంచ్ కావేరి

నార్నూర్, డిసెంబర్ 27, ప్రభాతవార్త :

నార్నూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ స్కూల్, ఆశ్రమ బాయ్స్ హాస్టల్‌ను సర్పంచ్ బాణోత్ కావేరి గజానంద్ నాయక్ శనివారం నాడు సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి విద్య, ఆరోగ్యం, భోజనం, హాస్టల్ సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంటశాలను పరిశీలించారు. ఆట స్థలం, తాగునీరు, విద్యుత్ సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని సూచించారు.



మాట్లాడుతున్న సర్పంచ్ కావేరి



## జన్ కళ్యాణ్ దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**- బీఎస్పీ స్టేట్ కో-ఆర్డినేటర్ అడ్వకేట్ నిషాని రామచంద్రం**

**మందమర్రి, డిసెంబర్ 27, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్రంలో జన్ కళ్యాణ్ దివస్ సందర్భంగా చేపట్టిన విరాళాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ అడ్వకేట్ నిషాని రామచంద్రం పిలుపునిచ్చారు. మంచిర్యాల పట్టణంలోని నీలకంఠేశ్వర హాస్పిటల్ ప్రాంగణంలో నిర్వహించిన జన్ కళ్యాణ్ దివస్ రివ్యూ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బహుజన పితామహుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, భారత రాజ్యాంగ పరిరక్షణకు, బహుజనుల ఆత్మగౌరవం, రాజకీయ అధికార సాధనకు, బహుజన ఉద్యమ బలోపేతానికి, సామాజిక ప్రజాస్వామ్య సాధన కోసంబహుజన్ సమాజ్ పార్టీకి విరాళాలు అందించాలని ఆయన కోరారు. బహుజన సమాజ రక్షణ కోసం సాగే ఈ ఉద్యమానికి బహుజనులే అధిక సంఖ్యలో ముందుకు వచ్చి విరాళాలు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్-మంచిర్యాల జిల్లాలకు చెందిన 5 అసెంబ్లీ నియోజకవర్గాల నుండి పార్టీ నాయకులు పాల్గొన్నారు. జనవరి 2వ తేదీ వరకు రూ.3,00,000 (మూడు లక్షల రూపాయలు) విరాళాలుగా సేకరించాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ కార్యక్రమంలోజోన్ ఇంచార్జ్ కాదసి రవీందర్, జిల్లా ఇంచార్జ్‌లు నాగుల కిరణ్ బాబు, దాగం శ్రీనివాస్, ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు తుకారాం, జిల్లా ఉపాధ్యక్షులు ముదస్సిర్, మాదిపెల్లి రాములు, బొల్లి నరేష్, కృష్ణచైతన్య, పెరుగు రవీందర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తలండిలో నట్టల నివారణ మందులను పంపిణీ చేస్తున్న దృశ్యం

## తలండిలో నట్టల నివారణ మందు పంపిణీ

**తిర్యాని, డిసెంబర్ 27, ప్రభాతవార్త;**

మండలంలోని తలండి, భీంజిగూడ గ్రామాల్లో తిర్యాని పశువైద్యశాల ఆధ్వర్యంలో శనివారం గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులను పంపిణి చేశారు. ఈ సందర్బంగా తిర్యాని పశు వైధ్యాధికారి సాగర్ మాట్లాడుతూ గొర్రెలకు, మేకలకు పశుసంవర్ధక శాఖ నుండి పంపిణి చేస్తున్న ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం 582 మేకలకు నట్టల నివారణ మందు పంపిణి చేశారు. ఈ కార్యక్రమములో తలండి, భీంజిగూడ సర్పంచ్‌లు నైతం మంగు, దేవేంద్రబాయి, మండల పశు వైద్య సిబ్బంది సురేష్, మనోహర్, రాకేష్, సంతోష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## డోర్లీ 2 ఓసీపీలోకి ఎవరు వెళ్లకూడదు

**- తిర్యాని ఎస్సై ఎస్ వెంకటేష్**

**తిర్యాని, డిసెంబర్ 27, ప్రభాతవార్త;**

మండలంలోని డోర్లీ 2 ఓసీపీలోకి ఎవరు వెళ్లకూడదని తిర్యాని ఎస్సై ఎస్ వెంకటేష్ పేర్కొన్నారు. ఇటీవల మూసివేసిన డోర్లీ 2 ఓపెన్‌కాస్ట్ భూఉపరితల గనిని ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్బంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజలకు ఇది ప్రవేశ నిషేధ ప్రాంతమన్నారు. డోర్లీ 2 ఓసీపీలోకి ఎవరు వెళ్లకూడదని . ఇది పర్యాటక ప్రాంతం కాదని ఇది పారిశ్రామికంగా మూసివేసిన ప్రాంతమన్నారు. ఇందులో నీటి లోతు 70 మీటర్లకు పైగా ఉందన్నారు. కాబట్టీ లోపలికి వెళ్లడం ప్రాణాపాయంమని, నిబంధనలు అతిక్రమించి లోపలికి ప్రవేశించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.



# పీఎం పోషణ పథకం అమలును బలోపేతం చేయాలి

**ఆసిఫాబాద్, డిసెంబర్ 27, ప్రభాతవార్త:**

విద్యార్థులకు పోషకాహారం అందించడంలో కీలకమైన పీఎం పోషణ (మధ్యాహ్న భోజన) పథకం అమలును మరింత బలోపేతం చేయాలని కార్యక్రమ ఇన్‌చార్జి, జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికలు) ఆవరణలో జిల్లా స్థాయి వంటల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగాజిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన మండల సమైక్య సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని తమ వంట నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కార్యక్రమ ఇన్‌చార్జి, జిల్లా సైన్స్ అధికారి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతతో పాటు పోషక విలువలు కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను కచ్చితంగా పాటిస్తూ పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ తరహా పోటీలు నిర్వహించడం వల్ల వంట సిబ్బందిలో నైపుణ్యం పెరగడంతో పాటు విద్యార్థులకు మెరుగైన భోజనం అందుతుందన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు అందించే భోజనాన్ని నిబంధనల ప్రకారం, మెనూ పాటిస్తూ స్వయంగా వండి న్యాయ నిర్ణేతల ముందుంచారు. భోజనం రుచి, పోషక విలువలు, పరిశుభ్రత, వడ్డన విధానం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని న్యాయ నిర్ణేతలు విజేతలను ఎంపిక చేశారు. అలాగే పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహక బహుమతులు కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ శ్రీనివాస్, ఇందిరా మహిళ సమైక్య అధ్యక్షురాలు స్వరూప, స్థానిక మండల విద్యాశాఖ అధికారి సుభాష్, జిల్లా కార్యాలయ సిబ్బంది కలిపాక మోహన్, కాళేశ్వర్, జగన్, ఓం ప్రకాష్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



వంటల పోటీలు నిర్వహిస్తున్న అధికారులు

# అటల్ బిహారీ వాజపేయి జీవితాన్ని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలి

**- బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్**

**మంచిర్యాల, డిసెంబర్ 27, ప్రభాతవార్త**

అటల్ బిహారీ వాజపేయి జయంతి 101వ జయంతి సందర్భంగా శనివారం మంచిర్యాల పట్టణం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 8వ అటల్ బిహారీ వాజపేయి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రాంగణంలో బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ బీజేపీ నాయకులు, క్రీడాకారులతో కలిసి వాజపేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఈ సందర్భంగా వెంకటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ అటల్ బిహారీ వాజపేయి జీవిత చరిత్ర అందరికీ స్ఫూర్తిదాయకం అని అన్నారు. దేశ రాజకీయ చరిత్రలో అన్ని రాజకీయ పార్టీల నేతలకు విలువలు నేర్పిన గొప్ప నాయకుడు వాజపేయి అని, వాజపేయి ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో పాకిస్థాన్‌తో కార్గిల్ యుద్ధం సమర్థవంతంగా ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. అటల్ బిహారీ వాజపేయి జీవిత చరిత్రను నేటి యువత తెలుసుకొని వారి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తం జాజు, ఎనగందుల కృష్ణ మూర్తి, దుర్గం అశోక్, జోగుల శ్రీదేవి, బియ్యాల సతీష్ రావు, రంగ శ్రీశైలం, సత్రం రమేష్, ఆకుల అశోక్ వర్ధన్, వైద్య శ్రీధర్, మెరెడికొండ శ్రీనివాస్, బుద్దారపు రాజమోళి తదితరులు పాల్గొన్నారు.



మ్యాచ్ ప్రారంభిస్తున్న భాజపా జిల్లా అధ్యక్షుడు

# కనుల పండువగా అయ్యప్ప మహా పడిపూజ

**- స్వామియే శరణంతో మారుమ్రోగిన ఆలయ ప్రాంగణం**

**ఆసిఫాబాద్, డిసెంబర్ 27, ప్రభాతవార్త:**

జిల్లా కేంద్రంలో పెద్దవాగు సమీపంలోని శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప సేవా సమితి, భక్తుల ఆధ్వర్యంలో శనివారం మండల మహాపడి పూజా కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జంబోజుల నాగేశ్వర్ ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు తదితర కార్యక్రమాలను చేపట్టారు. ఉదయం 4 గంటలకు స్వామివారికి సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యాహవచనం, మహాభిషేకం, హోమం, 5 గంటల నుండి స్వాములు విఘ్నేశ్వరస్వామి, అయ్యప్పస్వామి, సుబ్రమణ్యస్వాయి చిత్ర పటాలతో పేటతుల్లె ఆడుతూ నగరసంకీర్తన చేశారు. మధ్యాన్నం 1గంటల నుండి ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ చేశారు. రాత్రి 7 గంటలకు ఆలయంలో ఆదిలాబాద్ కు చెందిన దుబె (క్రాంతి) ఆధ్వర్యంలో మండల మహా పడిపూజ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. భక్తులు పాడిన భజన పాటలు పలువురిని ఆకట్టుకొన్నాయి. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదవితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప దీక్షాపరులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నగర సంకీర్తనలో పాల్గొన్న స్వాములు